51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- వచ్చే ఏడాది మే 13 వరకు సీజేఐగా పదవీ బాధ్యతలు

న్యూఢిల్లీ, నవంబర్ 11: సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఆంగ్లంలో, దైవసాక్షిగా ఆయన ప్రమాణం చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు. సీజేఐ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జస్టిస్ డీవై చంద్రచూడ్ పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మొదటిసారి కోర్టు నిర్వహించారు. తనకు అభినందనలు తెలిపిన న్యాయవాదులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం ఆదివారంతో ముగిసిన సంగతి తెలిసిందే.

న్యాయవాదిగా ప్రస్థానం మొదలు..

ఢిల్లీకి చెందిన జస్టిస్ సంజీవ్ ఖన్నా(64) వచ్చే ఏడాది మే 13 వరకు సీజేఐగా కొనసాగనున్నారు. ఆయన ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవ్‌రాజ్ ఖన్నా కుమారుడు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ యూనివర్సిటీలోని క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయవాద విద్యను పూర్తి చేశారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. మొదట తీస్‌హజారీ జిల్లా కోర్టులో, తర్వాత ఢిల్లీ హైకోర్టులో ఆయన ప్రాక్టీస్ చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం ఆయనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియమించింది. అయితే, సీనియారిటీని పాటించకుండా ఆయన నియామకం జరిగిందని పలువురు న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యతిరేకించడం అప్పట్లో వివాదంగా మారింది. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు కీలక తీర్పులు ఇచ్చారు. ఎన్నికల్లో ఈవీఎంల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ తీర్పునిచ్చారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థించిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా ఒకరు. ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేశారు.

పెద్దనాన్న కోల్పోయిన అవకాశం

జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా పెద్దనాన్న అవుతారు. నిజానికి 48 ఏండ్ల క్రితం జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా సీజేఐ కావాల్సి ఉంది. అయితే, ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా ఇచ్చిన తీర్పు ఫలితంగా ఆయన ఈ అవకాశాన్ని కోల్పోయారు. ఎమర్జెన్సీ సమయంలో పెద్ద ఎత్తున విపక్ష నేతల అరెస్టులు జరిగాయి. వీరు అరెస్టులపై కోర్టును ఆశ్రయించే హక్కు ఉంటుందని పలు రాష్ట్రాల హైకోర్టులు తీర్పులు చెప్పాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పులను సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివ్‌కాంత్ శుక్లా కేసుగా పిలిచే ఈ కేసును విచారించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు పౌరులకు లేదని 4:1 మెజార్టీతో తీర్పు చెప్పింది. ఈ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఒక్కరే ఈ తీర్పును వ్యతిరేకించారు. దీంతో సీనియారిటీ ప్రకారం 1977లో 15వ సీజేఐగా జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా నియామకం కావాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ వ్యతిరేకించడంతో జూనియర్ అయిన జస్టిస్ మిర్జా హమీదుల్లా బేగ్‌కు అవకాశం దక్కింది.

ఈపీఎఫ్ వేతన పరిమితి 21 వేలకు పెంపు!

త్వరలో కేంద్రం నిర్ణయం!

న్యూఢిల్లీ, నవంబర్ 11: ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్) పథకం కింద వేతన పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. చివరగా 2014 సెప్టెంబర్‌లో ప్రభుత్వం వేతన పరిమితిని పెంచింది. ఎకనమిక్ టైమ్స్ వార్తా కథనం ప్రకారం ఉద్యోగుల సామాజిక భద్రతను పెంచేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోనుంది. ఈ నిర్ణయం అమలైతే ఉద్యోగులు ఈపీఎఫ్, ఉద్యోగి పింఛను పథకం(ఈపీఎస్)కు చెల్లించే వాటాపై ప్రభావం పడుతుంది. భవిష్య నిధి చట్టాల ప్రకారం రూ.15 వేల కంటే ఎక్కువ మూల వేతనం కలిగిన వారు ఈపీఎఫ్ పథకంలో భాగస్వాములైనా, ఈపీఎస్‌లో సభ్యులుగా చేరలేరు. అయితే ఇప్పుడు వేతన పరిమితిని రూ.21 వేలకు పెంచితే మూల వేతనం రూ.15 వేల కంటే ఎక్కువ ఉన్నవారు ఈపీఎస్‌లో చేరేందుకు అర్హత పొందుతారు. ఈపీఎస్‌లో సభ్యులైన వారికి వారి యాజమాన్యం తరపున ఈపీఎఫ్ ఖాతాకు చెల్లించే వాటా తగ్గుతుందని గమనించాలి.

మత మార్పిడులకు పాల్పడితే ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు

న్యూఢిల్లీ: ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జీవోలు)కు కేంద్ర హోం శాఖ గట్టి హెచ్చరికలు పంపింది. అభివృద్ధి వ్యతిరేక కార్యకలాపాలు, మత మార్పిడులకు పాల్పడితే విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించింది. దురుద్దేశంతో నిరసనలను రెచ్చగొట్టినా, ఉగ్రవాద, ర్యాడికల్ సంస్థలతో సంబంధాలు ఉన్నా ఈ చర్య తప్పదని స్పష్టం చేసింది. కేంద్ర హోం శాఖ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన నోటీసును సోమవారం ప్రచురించింది. విదేశీ విరాళాలను స్వీకరించే ఎన్‌జీవోల కార్యకలాపాలు సాంఘిక లేదా మతపరమైన సామరస్యానికి విఘాతం కలిగించినా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయనున్నట్లు వివరించింది. ఏదైనా ఎన్‌జీవోను ఏయే లక్ష్యాల కోసం ఏర్పాటు చేశారో, ఆయా లక్ష్యాల కోసం విదేశీ విరాళాలను వినియోగించకపోయినా ఇదే చర్య తీసుకుంటామని తెలిపింది.

కర్ణాటకలో 40 వేల కోట్ల స్కామ్!

- ఘన వ్యర్థాల కాంట్రాక్ట్‌లో అక్రమాలు
- బ్లాక్ లిస్ట్ కంపెనీకి 25 ఏండ్ల పాటు పనులు
- రూ.40 వేల కోట్ల ప్రజాధనం పక్కదారి
- క్యాబినెట్‌లోని 33 మంది మంత్రుల హస్తం
- అవినీతి నిరోధక ఫోరమ్ అధ్యక్షుడి ఆరోపణ
- వరుస స్కాంలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్
- గ్యారెంటీలు భారమేనని ఒప్పుకొన్న సీఎం సిద్ధు

ఓ అధికారికి సాక్ష్యాధార పత్రాలను అందిస్తున్న ఎన్నార్ రమేశ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ముడా, వక్ఫ్ భూములు, వాల్మీకి కార్పొరేషన్, లిక్కర్ స్కామ్‌ల తర్వాత కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మరో భారీ కుంభకోణం జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ)లో ఘన వ్యర్థాల నిర్వహణ కాంట్రాక్ట్‌ను లోపభూయిష్టంగా ఓ కంపెనీకి అప్పగించినట్టు వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో రూ. 40 వేల కోట్ల మేర అవకతవకలు జరిగినట్టు అవినీతి నిరోధక ఫోరమ్ అధ్యక్షుడు ఎన్నార్ రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు 1,570 పత్రాలతో కూడిన సాక్ష్యాలను ఫిర్యాదుతో సహా అందజేశారు.

ఏమిటీ స్కామ్?

ఎన్నార్ రమేశ్ ఆరోపణల ప్రకారం.. బీబీఎంపీ పరిధిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కాంట్రాక్ట్ రమ్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. అయితే, టెండరింగ్ నియమాలను పాటించకుండా ముందస్తు ఒప్పందంలో భాగంగానే 25 ఏండ్ల పాటు ఈ పనులను సదరు కంపెనీకి ప్రభుత్వం అప్పగించిందని రమేశ్ ఆరోపించారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఓ కంపెనీకి ఇంతపెద్ద కాంట్రాక్ట్‌ను ఎలా అప్పగిస్తారని మండిపడ్డారు. సీఎం సిద్ధరామయ్య క్యాబినెట్‌లోని 33 మంది మంత్రులకు ఈ కుంభకోణంలో పాత్ర ఉన్నదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయంతో రూ. 40 వేల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టిందని ధ్వజమెత్తారు. దీనిపై పారదర్శకమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఏంది ఈ స్కామ్‌లు?

అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాకుండానే లెక్కకుమించిన కుంభకోణాలు రాష్ట్రంలో వెలుగుచూడటంపై సీఎం సిద్ధరామయ్య సర్కారుపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా వక్ఫ్ భూములకు సంబంధించి హౌజింగ్ శాఖ మంత్రి బీజడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఎక్సైజ్ శాఖలో అధికారుల బదిలీలు, షాపుల లైసెన్సుల జారీకి భారీగా వసూళ్లకు తెగబడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ శాఖ మంత్రి ఆర్బీ తిమ్మాపుర్, బెళగావి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగి మరణంలో మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ అనుచరుడి పాత్రపై వార్తలు రావడం వెరసి.. ఆయా మంత్రులపై కాంగ్రెస్ పెద్దలు గుర్రుగా ఉన్నట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. వీరికి త్వరలోనే అధిష్ఠానం నుంచి నోటీసులు రావొచ్చన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

గ్యారెంటీలతో ఖజానాపై భారమే!

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 5 గ్యారెంటీలు రాష్ట్ర ఖజానాకు భారంగానే మారాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎట్టకేలకు ఒప్పుకొన్నారు. అయితే, ఈ హామీలను నిలిపేయబోమని తెలిపారు. కాగా, రాష్ట్ర బడ్జెట్‌కు మించి గ్యారెంటీలు ఇవ్వొద్దని, అలా చేస్తే రాష్ట్రాలు దివాలా తీసే దుస్థితి వస్తుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల కాంగ్రెస్ నాయకులకు చురకలు అంటించడం తెలిసిందే.

'కాలుష్యాన్ని ఏ మతమూ ప్రోత్సహించదు'

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఏడాదంతా వాయుకాలుష్యం తాండవం చేస్తున్నప్పుడు ఫలానా నెలల్లో మాత్రమే టపాసులు కాల్చడంపై ఆంక్షలు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బాణసంచాపై దేశవ్యాప్తంగా శాశ్వత నిషేధం ఎందుకు విధించడం లేదని నిలదీసింది. కాలుష్యాన్ని సృష్టించే చర్యలను ఏ మతమూ ప్రోత్సహించదని పేర్కొంది. టపాసులు ఇలాగే కాల్చుకుంటే పోతే అది పౌరుల ఆరోగ్య హక్కును హరించడమే అవుతుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న నిషేధాన్ని అమలు చేయడంలో విఫలమైన ఢిల్లీ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తీరుపై కోర్టు తీవ్రంగా స్పందించింది. బాణసంచా తయారీ, అమ్మకం, కాల్చడంపై అక్టోబర్-జనవరి మధ్య మాత్రమే ఆంక్షలు ఎందుకని, ఏడాదంతా ఎందుకు విధించడం లేదని ప్రశ్నించింది. పండుగుల సీజన్, ఢిల్లీలో గాలి కాలుష్యాన్ని తీవ్రతరం చేసే నెలలపైనే దృష్టిసారించినట్టు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. భాటి వివరణపై సంతృప్తి చెందని ధర్మాసనం శాశ్వత నిషేధం విధించేలా చూడాలని సూచించింది. బాణసంచా తయారీ, అమ్మకాన్ని నిషేధిస్తూ అక్టోబర్ 14న ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయితే, ఎన్నికలు, వివాహాల సమయంలో బాణసంచా కాల్చడాన్ని మినహాయించింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు పరిశీలించింది.

అమెరికా ఆశ్రయం కోసం భారతీయుల బారులు

మూడేండ్లలో 855 శాతం పెరుగుదల

వాషింగ్టన్, నవంబర్ 11: అమెరికాలో జీవించాలని కలలు కనే భారతీయుల సంఖ్య ఏటికేడు పెరుగుతున్నది. ఆ దేశంలో ఆశ్రయం కోరినవారి సంఖ్య మూడేండ్లలో 855 శాతం పెరిగింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ 2023 అసైలీస్ యాన్యువల్ ఫ్లో రిపోర్ట్ ఈ వివరాలను వెల్లడించింది. అమెరికా ఆర్థిక సంవత్సరం 2021లో 4,330 మంది భారతీయులు అమెరికాలో ఆశ్రయం కోరారు. 2023 ఆర్థిక సంవత్సరంలో వీరి సంఖ్య 41,330(855 శాతం)కి పెరిగింది. వీరిలో సగానికిపైగా గుజరాతీయులేనని భారతీయ ఏజెన్సీల అధికారులు చెప్తున్నారు. 2023లో 5,340 మంది భారతీయులకు అమెరికాలో ఆశ్రయం లభించింది.

ప్రజ్వల్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: లైంగిక దాడి అభియోగాలు ఎదుర్కొంటున్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రేవణ్ణ చాలా ప్రభావవంతమైన వ్యక్తి అని వ్యాఖ్యానిస్తూ ఆయన విజ్ఞప్తిని తిరస్కరించింది. ఆయనపై ఆరోపణలు చాలా తీవ్రమైనవని పేర్కొన్నది. ఆయనకు బెయిల్ తిరస్కరిస్తూ కర్ణాటక హైకోర్ట్ అక్టోబర్ 21న తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని చెప్పింది.

కుమారస్వామిపై కర్ణాటక మంత్రి అనుచిత వ్యాఖ్యలు

బెంగళూరు: కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామిపై కర్ణాటక మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. ఆయన రంగును ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని చన్నపట్న శాసనసభ నియోజకవర్గానికి ఉపఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగీశ్వర, ఎన్డీయే అభ్యర్థిగా కుమార స్వామి తనయుడు నిఖిల్ పోటీ చేస్తున్నారు. యోగీశ్వర గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి, కొంత కాలం తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. దీని గురించి జమీర్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌లో కొన్ని విభేదాల వల్ల యోగీశ్వర స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని, ఆయనకు బీజేపీలో చేరడం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదన్నారు. ఆయన జేడీఎస్‌లో చేరడానికి సిద్ధంగా లేరని, ఎందుకంటే, బీజేపీ కన్నా 'కర్రి' కుమార స్వామి ఎక్కువ ప్రమాదకారి అని అన్నారు. ఇప్పుడు ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరారన్నారు. జమీర్ వ్యాఖ్యలపై జేడీఎస్ మండిపడింది. మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది.

ఉగ్ర దాడులతో అట్టుడుకుతున్న జమ్ము

ఈ ఏడాది ఇప్పటివరకు 44 మంది మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 11: ఉగ్రదాడులతో జమ్ము రీజియన్ అట్టుడుకుతున్నది. మొన్నటివరకు రాజౌరీ, పూంచ్ జిల్లాలకు పరిమితమైన ఉగ్రదాడులు, 2024లో జమ్ములోని మరో ఆరు జిల్లాలకు విస్తరించాయని భద్రతా అధికారులు వెల్లడించారు. సైన్యం కాల్పుల్లో 13 మంది ఉగ్రవాదులు హతం కాగా, ముష్కరుల దాడుల్లో 18 మంది భద్రతా సిబ్బంది వీరమరణం పొందారని అధికారులు పేర్కొన్నారు. ఉగ్రదాడుల్లో 14 మంది పౌరులు సహా మొత్తం 44 మంది చనిపోయారని, ఇందులో ఏడుగురు శివ్‌ఖేర్ ఆలయ భక్తులు కూడా ఉన్నారని చెప్పారు.

అయోధ్య పునాదుల్ని కదిలిస్తాం: పన్నూ

టొరొంటో: ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ మరోమారు భారత్‌పై బెదిరింపులకు దిగాడు. నవంబర్ 16, 17 తేదీల్లో అయోధ్య రామమందిరం సహా పలు హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగుతామని హెచ్చరించాడు. ఈ మేరకు పన్నూ వీడియో ప్రసంగం ఒకటి బయటకు వచ్చింది. 'హిందూత్వ భావజాలానికి కేంద్రమైన అయోధ్య పునాదుల్ని కదిలిస్తాం' అంటూ పన్నూ బెదిరించాడు. అలాగే, హిందూ ఆలయాలపై ఖలిస్థానీలు దాడులకు దిగుతారని, వీటికి సిద్ధంగా ఉండాలని కెనడాలోని హిందువులను హెచ్చరించాడు.

ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రలో 246 మంది మృతి

డెహ్రాడూన్: ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రలో 246 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో హెలికాప్టర్ ద్వారా వెళ్లిన భక్తులు ఎక్కువగా ఉన్నారు. చలికాలం వల్ల కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాల తలుపులను మూసేశారు. ఈ నెల 17న బద్రీనాథ్ దేవాలయం తలుపులు మూసేస్తారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రలో బద్రీనాథ్‌లో 65 మంది, కేదార్‌నాథ్‌లో 115 మంది, గంగోత్రిలో 16 మంది, యమునోత్రిలో 40 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- భద్రతా బలగాల కాల్పుల్లో 11 మంది హతం
- ఇండ్లు, దుకాణాలకు నిప్పు పెట్టిన దుండగులు

ఆర్మీ స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

ఇంఫాల్, నవంబర్ 11: మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. భద్రతా బలగాలు, అనుమానిత మిలిటెంట్ల మధ్య సోమవారం భీకర కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 11 మంది మిలిటెంట్లు మృతి చెందగా ఒక సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిరిబామ్ జిల్లాలోని జకురాధోర్‌లో ఉన్న సీఆర్పీఎఫ్ పోస్ట్‌తో పాటు బోరోబెక్రా పోలీస్ స్టేషన్‌పై సాయుధ మిలిటెంట్లు దాడి చేయగా భద్రతా బలగాలు ప్రతిఘటించాయని మణిపూర్ పోలీసు శాఖ తెలిపింది. 40-45 నిమిషాలు భీకర కాల్పులు జరిగాయని, ఆ తర్వాత ఘటనా స్థలం నుంచి 10 మిలిటెంట్ల మృతదేహాలను, అధునాతన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నది. కాల్పులు జరిగిన పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న శరణార్థ శిబిరంలో ఐదుగురి ఆచూకీ తెలియడం లేదని, వీరిని మిలిటెంట్లు కిడ్నాప్ చేశారా అనేది తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. స్థానికంగా పలు దుకాణాలు, ఇండ్లను సైతం మిలిటెంట్లు దగ్ధం చేసినట్టు చెప్పారు. కాగా, మరణించిన 11 మంది కుకీ తెగకు చెందిన గ్రామ వలంటీర్లని కుకీ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనకు నిరసనగా మంగళవారం కొండ ప్రాంతాల్లో బంద్‌కు పిలుపునిచ్చింది.

అల్లర్లకు ముఖ్యమంత్రే మాస్టర్ మైండ్

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌పై ఆ రాష్ట్రంలోని కుకీ తెగకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆయన తమతో చర్చలు జరుపుతున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు చెప్పడాన్ని ఖండించారు. వాస్తవాలను తెలుసుకోకుండా తుషార్ మెహతా కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు ప్రారంభమైన 2023 మే 3 నుంచి సీఎం తమతో చర్చలు జరపలేదని తెలిపారు. హింసాత్మక సంఘటనలకు సూత్రధారి ముఖ్యమంత్రేనని ఆరోపించారు.

స్టెమ్ సెల్ చికిత్సతో మళ్లీ కంటి చూపు

కొత్త చికిత్సను అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు



టోక్యో, నవంబర్ 11: లింబాల్ స్టెమ్ సెల్ డెఫిషియెన్సీ(ఎల్ఎస్‌సీడీ) సమస్యతో కంటిచూపు కోల్పోయిన వారి కోసం జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. ఎల్ఎస్‌సీడీ సమస్య ఉన్నవారిలో కార్నియాలోని లింబాల్ స్టెమ్ సెల్స్ మరమ్మతు చేసుకునే, పునరుత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతాయి. దీంతో కార్నియాపై మచ్చలు ఏర్పడి, క్రమంగా కంటిచూపు కోల్పోతారు. వీరికి మళ్లీ కంటిచూపు రావాలంటే ఆరోగ్యకరమైన దాత నుంచి లేదా రోగి మరో కంటి నుంచి కార్నియాను సేకరించి ట్రాన్స్‌ప్లాంట్ చేయాలి. చాలా రిస్కుతో కూడుకున్న ఈ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ప్రత్యామ్నాయంగా శాస్త్రవేత్తలు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా ఈ సమస్య ఉన్న నలుగురికి ఇండ్యూస్డ్ ప్లురిపొటెంట్ స్టెమ్(ఐపీఎస్) నుంచి సేకరించిన కణాలను కార్నియా కణాల స్థానంలో శాస్త్రవేత్తలు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. వీరిలో ముగ్గురికి ఏడాది కాలంలో కంటిచూపు మెరుగయ్యిందని, మరొకరిలో మాత్రం తాత్కాలిక మార్పు కనిపించిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ చికిత్సలో భాగంగా ఆరోగ్యకరమైన రక్త కణాలను పిండం లాంటి ఆకారంలోకి రీప్రోగ్రామ్ చేయాల్సి ఉంటుందని, ఆ తర్వాత వీటిని ఉపయోగించి ట్రాన్స్‌పరెంట్ టిష్యూను తయారుచేసి పాడైన కార్నియాలోకి చేరుస్తామని శాస్త్రవేత్త డాక్టర్ కోజ్జి నిషిద తెలిపారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలు లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అంతర్రాష్ట్ర మండలి పునరుద్ధరణ

- అధ్యక్షునిగా పీఎం, సభ్యులుగా ముఖ్యమంత్రులు
- శాశ్వత ఆహ్వానితులుగా 13 మంది కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ: కేంద్ర-రాష్ట్రాలు, వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారం కోసం అంతర్రాష్ట్ర మండలిని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. దీనికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహిస్తారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, శాసన సభ లేని కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లు, తొమ్మిది మంది కేంద్ర మంత్రులు సభ్యులుగా ఉంటారు. శాశ్వత ఆహ్వానితులుగా 13 మంది కేంద్ర మంత్రులకు స్థానం కల్పించారు. ఎన్డీయే కూటమిలోని జేడీయూ, జేడీఎస్, టీడీపీ, ఎల్‌జేపీ పార్టీలకు దీనిలో చోటు దక్కింది. దేశంలో సహకార సమాఖ్యతత్వాన్ని పెంపొందించేందుకు బలమైన వ్యవస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడానికి ఈ మండలిని పునరుద్ధరించినట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. ఈ మండలిలో సభ్యులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జగత్ ప్రకాశ్ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మల సీతారామన్, మనోహర్‌లాల్ ఖట్టర్, రాజీవ్ రంజన్ సింగ్ పురపు లలన్ సింగ్, వీరేంద్ర కుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడు నియమితులయ్యారు.

వయసు నిర్ధారణ తర్వాతే మద్యం అమ్మకాలు!

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: మద్యం కొనుగోలుదారుల వయసు నిర్ధారణకు పటిష్ట విధానాన్ని అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆదేశించింది. 'కమ్యూనిటీ ఎగెనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్' అనే సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. మద్యం విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల వయసును కచ్చితంగా నిర్ధారించిన తర్వాతే మద్యాన్ని విక్రయించే విధంగా పటిష్ట విధానాన్ని రూపొందించి, అమలు చేయాలని కోరింది. నిర్దిష్ట వయసు కన్నా తక్కువ వయసు గలవారు మద్యం సేవించడం, మద్యాన్ని కలిగి ఉండటం చట్ట విరుద్ధమని పేర్కొంది.



అంతరిక్షంలో విద్యుత్తు ఉత్పత్తి

- 2030 నాటికి అంతరిక్ష ఆధారిత సౌర విద్యుత్తు కేంద్రం
- ఐస్‌లాండ్‌తో యూకే సంస్థ స్పేస్ సోలార్ ఒప్పందం

లండన్, నవంబర్ 11: సౌర విద్యుత్తు ఉత్పత్తిలో సరికొత్త ముందడుగు పడనుంది. ఇప్పటివరకు భూమిపైన సౌరఫలకలను ఏర్పాటు చేసి సూర్య కిరణాలను గ్రహించి, విద్యుత్తు ఉత్పత్తి చేసేవారు. ఇక మీదట అంతరిక్షం నుంచే విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ దిశగా యూకేకు చెందిన స్పేస్ సోలార్ అనే అంకుర సంస్థ, ఐస్‌లాండ్ దేశానికి చెందిన విద్యుత్తు ఉత్పత్తి సంస్థ రేక్‌జావిక్ ఎనర్జీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2030 నాటికి 30 మెగావాట్ల అంతరిక్ష ఆధారిత సౌర విద్యుత్తు కేంద్రాన్ని ప్రారంభించాలనేది ఈ ఒప్పంద లక్ష్యం. సౌర విద్యుత్త